## క్లుప్తంగా

### గ్రామదేవతల విగ్రహాలకు ప్రాణప్రతిష్ఠ



ప్రత్యేక అలంకరణలో మారెమ్మ

**చౌడేపల్లె:** మండలంలోని పందిళ్లపల్లె పంచాయతీ బాలసముద్రంలో గ్రామ దేవతలు బోయకొండ గంగమ్మ, మారెమ్మ విగ్రహాలకు ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం ఆదివారం భక్తిప్రపత్తులతో నిర్వహించారు. నూతన ఆలయ విమాన గోపుర కలశ ప్రతిష్ఠ, ఉత్సవమూర్తి సంప్రోక్షణ, కుంభాభిషేకం కార్యక్రమాలను వేద పండితులు శాస్త్రోక్తంగా చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

### 43 మందికి కంటి వైద్య పరీక్షలు



ఆపరేషన్లకు ఎంపికైన వారితో కుప్పం పీఈఎస్ వైద్యులు

**బైరెడ్డిపల్లె:** స్థానిక జెడ్పీ హైస్కూల్లో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. మహతి ఫౌండేషన్ నిర్వహించిన ఈ శిబిరంలో కుప్పం పీఈఎస్ ఆస్పత్రి వైద్య నిపుణులు 43 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించి ఐదుగురిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు మణి శంకర్, ముస్తాఫ్, నిర్వాహకులు పాల్గొన్నారు.

### లాంఛనంగా రేషన్ పంపిణీ



బియ్యం పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

**కుప్పం:** స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని 9, 10, 5 రేషన్ షాపుల్లో సోమవారం నిత్యావసర సరుకుల పంపిణీని ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం లాంఛనంగా ప్రారంభించారు. లబ్ధిదారులతో మర్యాదగా ప్రవర్తిస్తూ సరుకులు పంపిణీ చేయాలని ఆయన డీలర్లను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ చిట్టిబాబు, స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

# రేషన్..టెన్షన్

ఇంటి వద్దకే రేషన్ విధానానికి స్వస్తి పలికి రేషన్ డీలర్ల వ్యవస్థను తీసుకొచ్చి నిత్యావసర సరకుల పంపిణీకి శ్రీకారం చుట్టిన కూటమి ప్రభుత్వానికి తొలిరోజే విమర్శలు మూటకట్టుకుంది. సర్వర్ మొరాయించడంతో ప్రజలకు మళ్లీ అవస్థలు తప్పలేదు. బియ్యం కోసం కార్డుదారులు పడిగాపులు పడాల్సి వచ్చింది. ఐదేళ్లుగా లేని రేషన్ కష్టాలు మళ్లీ మొదలయ్యాయని శాపనార్థాలు పెట్టారు. కొన్నిచోట్ల పడికాపులుగాసి వెనుదిరిగారు. పలుచోట్ల ధరల పట్టిక, స్టాక్ బోర్డు వివరాలు ప్రదర్శించలేదు.

- మొరాయించిన సర్వర్
- కుప్పం, పుంగనూరు, పలమనేరు నియోజకవర్గాల్లో తప్పని అవస్థలు
- బియ్యం కోసం కార్డుదారులు పడిగాపులు
- కూటమి ప్రభుత్వానికి శాపనార్థాలు

**కుప్పం:** కుప్పం నియోజకవర్గంలో 176 డీలర్ షాపులు ఉన్నాయి.వీటిలో ఆదివారం నుంచి నిత్యావసర సరుకుల పంపిణీకి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఉదయం అన్ని చౌక దుకాణాల్లో బియ్యం, చక్కెర పంపిణీ ప్రారంభించారు. కానీ సర్వర్ మొరాయించడంతో మొదటి రోజే కార్డుదారులకు చుక్కలు కనిపించాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిలబడి వేచి ఉన్నా బియ్యం, చక్కెర పంపిణీ చేయలేదు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 4 గంటల వరకు భోజన విరామం, 4 గంటల తరువాత కూడా సర్వర్ సక్రమంగా పనిచేయకపోవడంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడ్డారు. మధ్యాహ్నం మండుటెండలో నీరసిల్లి వెనుతిరిగారు. మున్సిపాలిటీ పరిధిలో 22 వార్డుహెచ్‌పీ రోడ్డులోని రేషన్ కార్డు లబ్ధిదారులు కృష్ణగిరి బైపాస్ వద్ద ఉన్నా రేషన్ షాపు డీలర్ వద్ద నిత్యావసర సరుకులు తీసుకోవాల్సి ఉండటంతో మహిళలు ఇబ్బందులు పడ్డారు. సర్వర్ మొరాయిస్తుండడంతో బియ్యం తీసుకులేక శాపనార్థాలు పెడుతూ వెనుదిరిగారు.



కుప్పం: కొత్తపేట డీలర్ షాపు వద్ద నిరీక్షిస్తున్న రేషన్ కార్డుదారులు

### సర్వర్ సమస్యతో ఇక్కట్లు

**సదుం:** మండలంలో మొదటి రోజైన ఆదివారం రేషన్ పంపిణీకి సర్వర్ సమస్య తలెత్తడంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడ్డారు. చాలాసేపు పడిగాపులు కాసినా సరుకులు అందని పరిస్థితి కలిగింది. జోగివారిపల్లెలో సర్పంచ్ అనితాకుమారి పంపిణీని ప్రారంభించారు.

### రెండుచోట్ల రేషన్ పంపిణీ నిల్

**రొంపిచెర్ల:** మండలంలోని రెండు చౌక దుకాణాల్లో బియ్యం పంపిణీ జరగలేదు. మండలంలో మొత్తం 28 చౌక దుకాణాలు ఉన్నాయి. అయితే వాటిలో జాండ్లవారిపల్లె గ్రామ పంచాయతీలోని దేపట్లవారిపల్లెలో డీలర్ అమర రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతుండడంతో ఇక్కడ బియ్యం పంపిణీ మొదటి రోజే ఆగింది. దీంతో డీలర్ బాధ్యతలను వీఆర్వో ధనశేఖర్‌కు ఆదివారం అప్పగించారు. సోమవారం నుంచి పంపిణీ చేస్తామని ఆయన చెప్పారు. అలాగే బండకిందపల్లె చౌక దుకాణంలో పక్కన ఒకరు చనిపోవడంతో అక్కడ బియ్యం పంపిణీ నిలిచిపోయింది. మిగిలిన అన్ని చౌక దుకాణాల్లో లబ్ధిదారులు గంటల తరబడీ నిరీక్షించి బియ్యం తీసుకున్నారు. పంపిణీ ప్రారంభించిన కొంతసేపటికే సర్వర్లు పని చేయకపోవడంతో ఈ పరిస్థితి ఉత్పన్నమైంది. చౌక దుకాణాల్లో ఎక్కడగానీ ధరల పట్టిక, స్టాక్ సమాచారం తెలియజేసే బోర్డులు పెట్టకపోవడం గమనార్హం!



సదుం: జోగివారిపల్లెలో సర్వర్ పనిచేయక వేచి ఉన్న లబ్ధిదారులు



రొంపిచెర్ల: బజారువీధిలో బియ్యం కోసం చౌక దుకాణానికి వచ్చిన మహిళలు

### పనిచేయని బీఎస్ఎన్ఎల్‌తో అవస్థలు



మారుతివారిపల్లెలో సెల్ టవర్

**సదుం:** మండలంలోని జోగివారిపల్లె పంచాయతీ మారుతివారిపల్లెలోని బీఎస్ఎన్ఎల్ టవర్ అలంకార ప్రాయంగా మారింది. ఏడెనిమిది రోజులుగా సిగ్నల్స్ సరిగా రాక అవస్థలు పడుతున్నట్లు గ్రామస్తులు వాపోయారు. జోగివారిపల్లె మారుమూల అటవీప్రాంతం కావడంతో ఈ పరిస్థితి తలెత్తుతోంది. సమస్యలో అప్పట్లో మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డికి గ్రామస్తులు నివేదించడంతో బీఎస్ఎన్ఎల్ టవర్ మంజూరు చేయించారు. అయితే టవర్ ప్రారంభం నుంచీ తరచూ సిగ్నల్స్ సమస్య తప్పడం లేదు. మండలంలో నాణ్యమైన సేవలు అందించాలని ఎంపీ సైతం బీఎస్ఎన్ఎల్ జీఎంకు గతంలో లేఖ రాశారు. ఈ ప్రాంతాల్లోని వారు పలువురు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా పనిచేస్తున్నారు. వారు సెలవులలో స్వగ్రామాలకు వచ్చినా సిగ్నల్స్ లేకపోవడంతో వర్క్ ఫ్రం హోంకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు ఇటీవల కాలంలో ఏనుగుల బెడద అధికమైంది. పంటలపై దాడులు చేసిన నష్టం కలిగిస్తున్నాయి. అత్యవసర సమయాలలో టవర్ సిగ్నల్స్ సరిగా లేక సమాచారం ఇచ్చేందుకు కూడా వీలు లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి నాణ్యమైన సేవలు అందించేలా చొరవ చూపాలని కోరుతున్నారు.

### మైనర్లకు బైక్‌లు ఇస్తే తల్లిదండ్రులపై కేసు

**కుప్పం:** మైనర్లకు బైక్‌లు ఇచ్చి ప్రమాదాలకు తావివ్వరాదని కుప్పం అర్బన్ సీఐ శంకరయ్య హితవు పలికారు. ఆదివారం కొందరు మైనర్లు ద్విచక్రవాహనాలకు నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డారు. దీనిపై సీఐ వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. మైనర్లు బైకుల్లో వెళ్తూ ప్రమాదానికి కారకులైతే వారి తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పిల్లల విషయంలో గారాబం పనికిరాదని, వారిని క్రమశిక్షణతో పెంచాలన్నారు.

### క్రమశిక్షణతోనే వ్యక్తిత్వ వికాసం

–రచయిత పలమనేరు బాలాజి



మాట్లాడుతున్న పలమనేరు బాలాజి

**పలమనేరు:** విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ కలిగి ఉంటే వ్యక్తిత్వ వికాసంతో రాణిస్తారని పెద్దపంజాణి ఎంపీడీఓ, ప్రముఖకవి, రచయిత పలమనేరు బాలాజి అన్నారు. పట్టణంలోని వాణి డిగ్రీ కళాశాలలో నిరుద్యోగ యువత కోసం వ్యక్తిత్వ వికాసం, ఉద్యోగాల ఇంటర్వ్యూలకు శిక్షణను పినాక ప్రజాసాధికార ట్రస్ట్ తరఫున మాజీ ఐఏఎస్ అధికారి యాదగిరి చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. విద్యార్థుల విజయానికి పేదరికం అడ్డు కాదన్నారు. డిగ్రీలు చదివి మంచి మార్కులు తెచ్చుకున్నా ఇంటర్వ్యూలో భావ ప్రకటనా నైపుణ్యాలు, మెలకువలు తెలియకక చాలామంది గ్రామీణ విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇలాంటి వారికి మేలు చేయాలనే సంకల్పంతో శిక్షణ ఇక్కడ ఇవ్వడం ఆనందదాయకమన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు, రిసోర్స్ పర్సన్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## టమాటకు లేదు..క్రేట్లకు మాత్రం డిమాండ్..!

**మండీల ముందు పడిగాపులు కాస్తున్న రైతులు**

**పలమనేరు:** టమాట ధర పడిపోవడంతో రైతులు నష్టాలు చవిచూస్తున్నారు. తోటల్లో మాగిపోతున్న కాయలను కోసి మార్కెట్ తరలిద్దామంటే వీరికి క్రేట్ల సమస్య తప్పడం లేదు. దీంతో రైతులు కోతకు ముందునాడే పలమనేరు మార్కెట్‌లో మండీల ముందు వేచి మండీవారిని ప్రాధేయపడి మరీ ఖాళీ బాక్సులను తీసుకెళ్లాల్సి వస్తోంది. పట్టణంలోని మార్కెట్‌లో 60కిపైగా టమాట మండీలున్నాయి. వీటి వద్ద రైతులు ఖాళీ బాక్సుల కోసం కుస్తీలు పడాల్సి వస్తోంది. వీటిని తీసుకెళ్లి, టమాటాలు కోసి, వీటిల్లో నింపి మార్కెట్‌కు తీసుకురావాల్సి ఉంది. మండీ యజమానులు సైతం నాణ్యమైన సరుకున్న రైతులకు ప్రాధాన్యతనిచ్చి క్రేట్లను వారికే ఎక్కువగా ఇస్తున్నారు. దీంతో సన్నచిన్నకారు రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



మండీల వద్ద టమాటాలు నింపి పెట్టిన క్రేట్లు(ఫైల్)

## లాభసాటి పంటలు సాగు చేయండి



పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ మంజుల

**రొంపిచెర్ల:** రైతులు లాభసాటి పంటలను సాగు చేయాలని కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ మంజుల అన్నారు. ఆదివారం గానుగచింత రైతు సేవా కేంద్రంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో రైతులకు అవగాహన నకల్పించారు. ఆమె మాట్లాడుతూ, ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ సాగు చేసే రైతులు విశిష్ట నిత్యహరిత లాంటి రకాలను సాగు చేయవచ్చన్నారు. ఆఖరి దుక్కి కంటే ముందు 100 కిలోల పశువుల ఎరువులో 2 కిలోల ట్రైకోడర్మా, సూడోమోనాస్ కలిపి వేయాలన్నారు. ఇది భూమిలో ఉన్న పురుగులను నిర్మూలిస్తుందన్నారు. ఉద్యానవన కళాశాల ప్రొఫెసర్ రాజా నాయక్ మాట్లాడుతూ, జూన్, జూలైలో మామిడి తోటలలో కొమ్మల కత్తిరింపు చేస్తే పూత సరైన సమయానికి వస్తుందన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు మహేశ్వర్ రెడ్డి, పీరూసాహెబ్, మండల పశువైద్యాధికారి శ్రీధర్, రైతు సేవా కేంద్రం ఇన్‌చార్జి శ్రీనివాసులు పాల్గొన్నారు.

## ఘనంగా గంగజాతర





విశ్వరూప దర్శనంలో గంగమ్మ, బైరెడ్డిపల్లె: బాటగంగమ్మ ముందు వైఎస్సార్ సీపీ నేతలతో గ్రామస్తులు

**పలమనేరు:** మున్సిపాలిటీలోని గంటావూరు బీసీ కాలనీలో ఆదివారం తిరుపతి గంగమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. శనివారం రాత్రి అమ్మవారి శిరస్సు మెరవణి, ఆదివారం విశ్వరూప దర్శనానికి భక్తులు పోటెత్తారు. మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ స్థానిక నాయకులతో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రజలు సుఃఖసంతోషాలతో ఉండాలని మొక్కారు. జాతర సందర్భంగా నిర్వాహకులు ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

**ధర్మపురిలో...**

**బైరెడ్డిపల్లె:** మండలంలోని ధర్మపురిలో శనివారం రాత్రి వైభవంగా గంగమ్మ జాతర నిర్వహించారు. గ్రామ పొలిమేరల్లో అమ్మవారి శిరస్సుకు ప్రత్యేక పూజలు నిర్వహించి పురవీధుల్లో ఊరేగించారు. ఆదివారం ఉదయం ఆలయం వద్ద ప్రతిష్ఠించారు. చుట్టు ప్రక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. రాష్ట్ర వైఎస్సార్‌సీపీ కార్యదర్శి బైరెడ్డిపల్లె క్రిష్ణమూర్తి, వైస్ ఎంపీపీ రూప జయకుమార్‌రెడ్డి, సర్పంచులు బాల క్రిష్ణగౌడు, వెంకటేష్, రాజప్ప, రమణారెడ్డి, సుజాత, ఎంపీటీసీలు నాగరాజు, వినాయకం, వైఎస్సార్‌సీపీ నేతలకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు.

**నేటి నుంచి వి.కోటలో..**

**వి.కోట:** స్థానిక శ్రీ గంగమాంబ జాతర సోమవారం నుంచి ప్రారంభించనున్నట్టు ఆలయ ధర్మకర్త కార్తికేయన్ ఆదివారం తెలిపారు. సోమవారం ఉదయం అమ్మవారికి అభిషేకం, రాత్రి శిరస్సు, పూలగెరిగ, పుష్పపల్లకి, 3న ఉదయం 6 గంటలకు అగ్నిగుండ ప్రవేశం, అమ్మవారికి అభిషేకానంతరం రాత్రి 9 గంటల వరకు దీపారాధన, 12 గంటలకు వసంతోత్సవం నిర్వహించనున్నట్టు తెలియజేశారు. అంతకుముందు సాయంత్రం 5 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన ఉంటుందని చెప్పారు.

# ప్రజలను మరీ ఇంత మోసం చేస్తారా?

- ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారు
- ప్రజలకు మంచి చేసిన పాపానపోలేదు
- వైఎస్సార్‌సీపీ వారిపై కేసులు తప్పితే ఇంకేమైనా ఉందా?
- 'వెన్నుపోటు దినం' పోస్టర్ల ఆవిష్కరణలో పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ





వెన్నుపోటు దినం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పలమనేరు కో–ఆర్డినేటర్ వెంకటేగౌడ, నాయకులు, పుంగనూరులో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మాజీ ఎంపీ రెడ్డెప్ప, నాయకులు

**పలమనేరు:** ప్రజలను మరీ ఇంత మోసం చేసిన కూటమి ప్రభుత్వం లాంటిది ప్రపంచంలో దేశంలో మరొకటి లేదని పలమనేరు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ కో–ఆర్డినేటర్ వెంకటేగౌడ విమర్శించారు. పార్టీ అధిష్టానం పిలుపు మేరకు ఈ నెల 4వ తేదీన నిర్వహించ తలపెట్టిన ×వెన్నుపోటు దినం¥ కార్యక్రమానికి సంబంధించి పోస్టర్లను ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ నాయకులతో కలసి వెంకటేగౌడ ఆవిష్కరించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఓట్లకోసం ప్రజలను అలవిగాని హామీలతో మభ్యపెట్టిందని, అధికారంలోకి వచ్చి ఏడాది కావొస్తున్నా సూపర్‌సిక్స్‌ను అమలు చేయకుండా ప్రజలను వంచించిందని దుయ్యబట్టారు. ఎంతసేపూ వైఎస్సార్‌సీపీ నేతలను అణచి వేసేందుకు కేసులు, సోషల్ మీడియాలో ఎవరైనా విమర్శిస్తే వారిపై కేసులు బనాయించడం, ×రెడ్‌బుక్¥ జులుం ప్రదర్శించడం తప్పితే ప్రజలకు ఏ ఒక్క మంచైనా చేశారా? అని సూటిగా ప్రశ్నించారు. అందుకే 4న ఆర్డీఓ కార్యాలయం వద్ద నిరసన తెలిపి వ్యక్తం చేసి వినతిపత్రం ఇస్తామని, కార్యక్రమంలో నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గంలో మండల కన్వీనర్లు హేమంత్‌కుమార్ రెడ్డి, బాలాజీనాయుడు, బాగారెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఎంపీపీలు యువరాజ్, వెంకటరమణ, వైస్ ఎంపీపీ తమీం, రాష్ట్ర కార్యదర్శులు బైరెడ్డిపల్లి క్రిష్ణమూర్తి, మురళీకృష్ణ, మండీసుధా, జాఫర్, చెంగారెడ్డి, ప్రహ్లాద, చలపతి రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, మండలాల నేతలు, పార్టీ అనుబంధ విభాగాలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**ప్రజలకు కూటమి వెన్నుపోటు : మాజీ ఎంపీ**

**పుంగనూరు(చౌడేపల్లె):** ఈనెల 4న నిర్వహించనున్న వెన్ను పోటు దినం విజయవంతం చేయాలని మాజీ ఎంపీ రెడ్డెప్ప కోరారు. ఆదివారం పుంగనూరులోని వైఎస్సార్ విగ్రహం వద్ద పార్టీ శ్రేణులతో కలసి వెన్నుపోటు దినం పోస్టర్లను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్టు చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది అవుతున్నా ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రజలకు వెన్నుపోటు పొడిచిందని విమర్శించారు. అంతకు ముందు వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సీమ జిల్లాలపార్టీ మైనార్టీ సెల్ కన్వీనర్ ఫకృద్దీన్, మునిసిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, ఎంపీపీ భాస్కర్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కొండవీటి నాగభూషణం, చెంగారె డ్డి, అమర్నాథ్ రెడ్డి, ఇర్ఫాన్, రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

**కుప్పంలో..**

**కుప్పం:** స్థానిక ఎమ్మెల్సీ భరత్ క్యాంపు కార్యాలయంలో 'వెన్నుపోటు దినం' పోస్టర్లను పార్టీ నాయకులు ఆవిష్కరించారు. 4న కుప్పంలో నిర్వహించనున్న వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమాన్ని నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున తరలివచ్చివిజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్లు మురుగేష్, బాబురెడ్డి, శాంతిపురం ఎంపీపీ కోదండరెడ్డి, కౌన్సిలర్లు మోహన్‌రామ్, రాజ్‌కుమార్, సర్పంచులు మోహన్ నాయక్, మురుగేష్, నాయకులు సారథి, ఈశ్వర్, జీవీ రమేష్, రాజా తదితరులు పాల్గొన్నారు.

**చౌడేపల్లెలో...**

**చౌడేపల్లె:** ఈనెల 4న పుంగనూరులో నిర్వహించ తలపెట్టిన 'వెన్నుపోటు దినం' కార్యక్రమాన్ని విజయంవంతం చేయాలని మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ జి. నాగభూషణరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం చౌడేపల్లెలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులతో వెన్నుదినం విజయవంం చేయడంపై జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు ఎన్. దామోదరరాజు, ఎంపీపీ రామమూర్తితో కలిసి మాట్లాడారు. ఎమ్మెల్యే డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి ఆదేశం మేరకు 2వ తేదీ సోమవారం ఉదయం 9:30 గంటలకు బస్టాండు కూడలిలోని మహానేత డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వద్దకు పార్టీ శ్రేణులు రావాలని, అలాగే బుధవారం పుంగనూరులో తలపెట్టిన కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో మాజీ ఎంపీపీ రుక్మిణమ్మ, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు కృష్ణారెడ్డి, సింగిల్ విండో మాజీ చైర్మన్ రవిచంద్రారెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, నేతలు పాల్గొన్నారు.

**నేడు వెన్నుపోటు దినం పోస్టర్ల ఆవిష్కరణ**

**సదుం:** మండల కేంద్రంలో సోమవారం వెన్నుపోటు దినం పోస్టర్లను వైఎస్సార్ విగ్రహం వద్ద ఉదయం 10.30 గంటలకు ఆవిష్కరించనున్నట్టు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రెడ్డెప్ప రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ శ్రేణులు హాజరు కావాలని ఆయన కోరారు.



కుప్పంలో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు



చౌడేపల్లెలో..

## భద్రత నియమాలు పాటిస్తే సురక్షిత ప్రయాణం



వాహన చోదకులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ, పోలీసులు

**వి.కోట:** వాహనచోదకులు రోడ్డు భద్రత నియమాలను పాటిస్తే ప్రమాదాల బారిన పడకుండా సురక్షిత ప్రయాణం చేయవచ్చని వి.కోట ఎస్ఐ జావీద్‌బాషా అన్నారు. ఆదివారం పట్టణంలోని వైఎస్సార్ సర్కిల్‌లో ఎస్ఐ నాకాబందీ నిర్వహించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేనివారికి, ట్రిపుల్ రైడింగ్ చేస్తున్న వారికి, హెల్మెట్ లేని చోదకులకు జరిమానా విధించి ఆయన మాట్లాడారు.